సాక్షి
ములుగు

శనివారం | 3 | జూన్ | 2023



ధాన్యం కొనుగోళ్లపై అన్నదాతల ఆగ్రహం

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని ఆరోపిస్తూ రేగులగూడెం అన్నదాతలు ఆగ్రహించారు.

- 8లో▶



ఇద్దరు మావోయిస్టుల అరెస్టు

ఇద్దరు మావోయిస్టులను అరెస్టు చేసి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ గాష్ ఆలం తెలిపారు.

- 8లో▶

గరిష్టం/కనిష్టం
42.0^{0} / 29.0^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండలు దంచికొడుతాయి. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

ములుగు ముందడుగు

ప్రతీసారి జిల్లా కొత్తగా కనిపిస్తుంది..

- అభివృద్ధి పనులే దానికి తార్కాణం
- అన్ని రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోంది
- మరింత అభివృద్ధి చేయడానికి సీఎం సిద్ధంగా ఉన్నారు
- కలెక్టరేట్‌లో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు
- జెండా ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ప్రభాకర్ రావు



జెండాకు వందనం చేస్తున్న ప్రభాకర్‌రావు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తూ..



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ అంకిత్



జెండా వందనం చేస్తున్న ఎస్పీ గాష్ ఆలం



పరేడ్‌లో పాల్గొన్న ప్రభాకర్‌రావు, కలెక్టర్, ఎస్పీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రభాకర్‌రావు

ములుగు: ఎనిమిది సంవత్సరాలుగా ములుగుకు వస్తున్న ప్రతీసారి జిల్లా కొత్తగా కనిపిస్తుందని, అభివృద్ధిలో ములుగు ముందడుగులో ఉందని ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్ రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ స్వరాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్ ప్రభాకర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం 8.50 నిమిషాలకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన నేరుగా అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రత్యేక వాహనంలో పరేడ్‌లో పాల్గొన్నారు. జెండావిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ములుగును అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్తున్న కలెక్టర్ కృష్ణఆదిత్యను అభినందించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ములుగు జిల్లా ఏర్పడిన అనంతరం అన్ని శాఖలు ఒకే చోట ఉండే విధంగా రూ.65 కోట్లతో సమీకృత కలెక్టరేట్ కార్యాలయ పనులు జరుగుతున్నాయని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ఇకముందు ప్రారంభించడానికి సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో రైతుబంధు పథకం ద్వారా రూ.6,83,023 మంది రైతులకు గాను రూ. 645.29 కోట్లను వారి ఖాతాలో జమ చేశామన్నారు. జిల్లాలోని 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలను అందించేందుకు ఒక్కో భవనానికి రూ. 25 లక్షల నిధులు కేటాయించి ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్మించినట్లు తెలిపారు. ఏటూరునాగారంలో రూ .7 కోట్లతో మాతా, శిశు సంరక్షణ కేంద్రం, జిల్లా కేంద్రంలో రూ. 65 లక్షలతో రేడియాలజీ భవనం నిర్మాణం, ఈ– హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 1,81,655 మందికి పరీక్షలు నిర్వహించమన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిసరాల్లో ప్రశాద్ స్కీంలో భాగంగా రూ.61.99 కోట్లతో అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు చేపట్టామన్నారు. స్వదేశీ దర్శన్ స్కీంలో భాగంగా గట్టమ్మ ఆలయం వద్ద రూ.7.35 కోట్లు, లక్నవరం వద్ద రూ.27.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్న అన్ని శాఖల ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యాశాఖ తరపున ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లను ప్రభాకర్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్, అడిషనల్ కలెక్టర్‌లు ఇలా త్రిపాఠి, వైవీ గణేష్, ఎస్పీ గాష్ ఆలం, ఓ ఎస్ డీ అశోక్ కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, ములుగు జెడ్పీటీసీ సకినాల భవాని, సబ్ రిజిస్టర్ తస్లీమా మహమ్మద్, విద్యాశాఖ అధికారి పాణిని, వైద్య శాఖ అధికారి అల్లం అప్పయ్య, డీఎస్పీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

ఏటూరునాగారం: గిరిజనుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఐటీడీఏ కృషి చేస్తుందని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను పీఓ అంకిత్ ఎగురవేశారు. అనంతరం సమావేశపు గదిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే మేడారం జాతరకు 21 శాఖలతో రూ.15.60 కోట్లు శాశ్వత నిర్మాణాలకు రూ.55.60 కోట్లతో మరమ్మతులు చేయించడం జరుగుతుందన్నారు. అలాగే విద్యాశాఖ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గిరిజన విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 8 టీంలు ఏర్పాటు చేసి గిరిజన గ్రామాల్లో సేవలు అందిస్తున్నట్లు పీఓ తెలిపారు. ఇంజనీరింగ్ ద్వారా బీటీ రోడ్లు, మరుగుదొడ్లు, ఇతర నిర్మాణం పనులు రూ.316 కోట్ల పనులు చేయించామన్నారు. ట్రైకార్ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు 6,761 యూనిట్లు ఈఎస్ఎస్ కింద మంజూరు కాగా రూ. 5.5 కోట్లతో నిధులు మంజూరు ఇచ్చి యూనిట్లు అప్పగిస్తున్నామన్నారు. శిక్షణ కింద 1,343 మంది నిరుద్యోగ యువతీయువకులకు పలు రకాల శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించామన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 17,006 మందికి రైతులకు ఎకరానికి రూ. 5వేల చొప్పున లబ్ధి చేకూర్చుతుందన్నారు. 14 పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసి గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఏఓ దామోదర స్వామి, ఎస్ఓ రాజ్‌కుమార్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, పీహెచ్ఓలు రమణ, భారతి, ఏపీఓ సంతోష్, మేనేజర్ శ్రీనివాస్, డీఎస్ఓ లాల్, ఏసీఎంఓ రవీందర్, ఏఏసీఎంఓ వాగ్యా, జీసీడీఓ సుగుణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఏటూరునాగారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు (శనివారం) రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏలో జరిగిన సెక్టార్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతువేదికలను ముస్తాబు చేసి దినోత్సవం జరిపించాలని, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్, పీహెచ్ఓ రమణ, ఏడీ అగ్రికల్చర్ శ్రీధర్, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు పాక్షికంగా దగ్ధం



మంగపేట: మండలంలోని మారుమూల అటవీ గ్రామమైన కొత్తూరు మొట్లగూడెంలో గ్రామస్తుల అప్రమత్తతో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి సమీపంలోని పంట పొలాల్లో ఎరగడి మంటలు అంటుకున్నాయి. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వీచిన మంటలు ఎగిసిపడి జనావాసాలకు సమీపంలోని తాటి చెట్లు, పొదలకు అంటుకున్నాయి. దీంతో భారీగా అగ్నికీలలు ఎగిసి పడటంతో గ్రామంలోని బంగారు నాగేష్, పొదెం సురేష్ అనే ఇద్దరి ఇళ్లపై నిప్పు రవ్వలు పడి మంటలు లేచాయి. గ్రామస్తులు తేరుకుని ఇళ్లలోని బిందెలతో నీటిని చల్లి మంటలను అదుపు చేసి దగ్ధమైన గడ్డిని తొలగించారు. ఇతర ప్రాంతాలు, ఇళ్లకు వ్యాపించకుండా గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌తో మంటలను ఆర్పివేశారు. గ్రామస్తులందరు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ఇళ్లలో ఉన్న నీటిని బిందెలు, బకెట్లతో తీసుకువచ్చి మంటలను ఆర్పి వేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కుమారస్వామి ఫైరింజన్‌కు సమాచారం అందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు అదుపులోకి రాగా కొద్ది సమయం తరువాత ఫైరింజన్ సిబ్బంది చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పి వేశారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



భూపాలపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సాధారణ ప్రజలకు భరోసా కల్పిస్తూ స్నేహపూర్వక పోలీసింగ్‌తో ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ ఒకే రకమైన సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.శ్రీనివాసులు, అదనపు ఎస్పీ (ఏఆర్) వి.శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ షాపులు బంద్

హన్మకొండ అర్బన్ : సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు సంఘం జిల్లా నాయకుడు గౌరీశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రేషన్‌షాపులు బంద్ పాటిస్తామని పేర్కొన్నారు. చాలీచాలని కమీషన్లతో తమ బతుకులు అధ్వానంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లోపు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి రేషన్ డీలర్ సమ్మెలో పాల్గొంటాడని, లబ్ధిదారులు సహకరించాలని కోరారు.

గద్దె లేదని జెండా ఎగురవేయలేదు



కన్నాయిగూడెం ఎంపీడీఓ కార్యాలయం

కన్నాయిగూడెం: తెలంగాణ ఆవిర్భావ వేడుకలో గద్దె లేదని జెండా ఎగురవేయని ఘటన కన్నాయిగూడెం మండల ఎంపీడీఓ కార్యాలయంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ప్రజా పరిషత్ కార్యలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు జెండా గద్దె లేదనే కారణంతో ఎగురవేయకుండా పక్క గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎగురవేసినట్లు తెలిసింది. ఇటీవల మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా ప్రారంభించిన కార్యాలయంలో జెండా ఎగురవేయకపోవడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఎంపీడీఓను వివరణ కోరగా జెండా ఎగురవేయడానికి గద్దె లేదని సెలవిచ్చారు.

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

విద్యారణ్యపురి : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు ఈ నెల 5 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) గోపాల్ శుక్రవారం తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ కళాశాలల్లో హాల్‌టికెట్లు తీసుకొని పరీక్షలకు హాజరుకావాలని డీఐఈఓ సూచించారు.

తెలంగాణ రన్

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలో తెలంగాణ రన్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేడ్కర్ సెంటర్, జయశంకర్ సెంటర్ల మీదగా జీఎం కార్యాలయం వరకు రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీఎం శ్రీనివాసరావు హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అంబేడ్కర్ సెంటర్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలమాల వేసి అమరవీరులకు నివాళ్లర్పించారు. అనంతరం అంబేడ్కర్, జయశంకర్ విగ్రహాలకు పూలమాల వేశారు. తన కార్యాలయంలో జీఎం శ్రీనివాసరావు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రామలింగం, జోతి, ఎన్‌వీ రావు, వెంకట్రామిరెడ్డి, కవీంద్ర, ప్రసాద్, సురేఖ, తుకారాం, యూనియన్ నాయకులు సమ్మయ్య, రమేష్, బుచ్చయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ సేవా సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

జిల్లా జడ్జి పీవీపీ లలిత శివజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

ములుగు రూరల్: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా జెడ్జి పీవీపీ లలిత శివజ్యోతి అధికారులను సూచించారు. శుక్రవారం తన చాంబర్‌లో పలుశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అధిక కేసులు పరిష్కారం అయ్యే విధంగా పోలీస్, ఎక్సైజ్ అధికారలు సహకరించాలన్నారు. రాజీపడే కక్షిదారులకు ఎలాంటి ఇబ్బంది, ఒత్తిడికి గురి చేయకుండా రాజీ మార్గం ద్వారా కేసు పరిష్కరించుకునే విధంగా సహాయపడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రాంమోహన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ చారి, మేకల మహేందర్, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్ రావు, భిక్షపతి, సునిల్ కుమార్, రామ్‌సింగ్, స్వామిదాస్, డీసీఆర్‌బీ డీఎస్పీ సురేష్‌బాబు, సీఐ రంజిత్ కుమార్, ఎస్‌హెచ్ఓలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవలందించడంలో నిర్లక్ష్యం వద్దు



ఆస్పత్రిలో చేరిన రాణిని పరిశీలిస్తున్న అప్పయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని కొశెట్టివాయి గ్రామానికి చెందిన మంకిడి రాణి ఆరోగ్య సమస్యతో బాధపడుతుండగా భర్త శ్రీను వైద్యం కోసం మండల కేంద్రంలోని తాడ్వాయి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్య సేవలు సరిగా అందించడం లేదని రాణి భర్త మంకిడి శ్రీను డీఎంహెచ్ఓ అప్పయ్యకు ఫోన్ చేయగా అందుబాటులో ఉన్న ఆయన స్పందించి ఆస్పత్రికి వెళ్లారు. రాణిని పరిశీలించి కిడ్నీ సంబంధించిన వ్యాధిగా గుర్తించి ఆమెకు తగిన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సిబ్బందితో మాట్లాడుతూ ఆరోగ్య సమస్యతో ఆస్పతికి వచ్చిన రోగుల ఆరోగ్య సమస్యలను ఓపికగా తెలుసుకుని వైద్య సేవలందించాలని విధుల్లో ఉన్న నర్సులకు సూచించారు. ఆయన వెంట ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్, వైద్యాధికారి పవన్ ఉన్నారు.

మెడికల్ షాపు సీజ్



మల్లంపల్లిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ములుగు రూరల్: ఔషధ నియంత్రణశాఖ నిబంధనలు అతిక్రమించి అనుమతులు లేకుండా మెడికల్ షాపు నిర్వహిస్తున్న ఓ షాపును సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశారు. ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వరంగల్ రాజ్యలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లి గ్రామానికి చెందిన ఆనందపు రవిబాబు తన ఇంట్లో శ్రీసాయి మెడికల్ అండ్ జనరల్ స్టోర్ పేరుతో వ్యాపారం చేస్తున్నారు. అనుమతులు లేకుండా మందులు విక్రయించడంతో మెడికల్‌షాపులోని రూ. 70వేల విలువ గల మందులు సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైన అనుమతులు లేకుండా మెడికల్ షాపుల నిర్వాహణ కొనసాగిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములుగు, హన్మకొండ, వరంగల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పావని, కిరణ్‌కుమార్, అరవింద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

60 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా



ములుగు: జెండాకు వందనం చేస్తున్న సీతక్క, నాయకులు



ములుగు రూరల్: జెండాను ఆవిష్కరిస్తున్న భాస్కర్‌రెడ్డి

ములుగు: 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను తీర్చిన తల్లి సోనియాగాంధీ అని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ దనసరి సీతక్క అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, గాంధీ విగ్రహం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ పది ఏళ్ల పాలనలో ఏ ఒక్క వ్యక్తికి తగిన న్యాయం జరగలేదన్నారు. 1,200 మంది ప్రాణ త్యాగాలను చూసిన సోనియా గాంధీ తెలంగాణ ఇస్తే ఉద్యోగాలు లేవు, ఉపాధి ఇవ్వలేదు కానీ తన కుటుంబం లో మాత్రం అందరికీ ఉద్యోగాలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్, కంబాల రవి, బైరెడ్డి బాగవాన్ రెడ్డి, ఎండీ చాంద్ పాషా, ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్ కుమార్, బండి శ్రీనివాస్, సత్తిరెడ్డి, రవి యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ములుగు రూరల్: తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మబలిదానాల పునాదులపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, రవింద్రాచారి, వాసుదేవరెడ్డి, ఉత్తమ్‌కుమార్, గాదం కుమార్, రాజ్‌కుమార్, కృష్ణాకర్, కొత్త సురేందర్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గోవిందరావుపేట మండలంలోని పస్రాలో మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు ఆధ్వర్యంలో అవతరణ వేడుకలకు మహబూబాబాద్ లోక్‌సభ కో కన్వీనర్ తక్కళ్లపల్లి దేవేందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు.

కేసీఆర్ ప్రధాని కావాలని సుదర్శన యాగం



కాటారం: సీఎం కేసీఆర్ ప్రధాని కావడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, మంథని ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో సుదర్శన యాగం చేశారు. వేద పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ యాగం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్ల సుజాత, బీఆర్ఎస్ నాయకులు దబ్బెట రాజేశ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన మ్యూజియం ముస్తాబు



తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబు చేశారు. విద్యుత్ లైట్ల వెలుతురులో జిగేల్‌మంటూ కనిపిస్తుంది. ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం గిరిజన మ్యూజియం భవనాన్ని కూడా విద్యుత్ లైట్లతో అలంకరించారు. – ఏటూరునాగారం

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేసి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ గాష్ ఆలం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 01వ తేదీన విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వెంకటాపురం(కె) సర్కిల్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధం కలిగిన వ్యక్తులు పేలుడు పదార్థాలను అమర్చుతున్న క్రమంలో పట్టుకుని, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు. పూజారి కాంకేర్ గ్రామం, ఊసూర్ బ్లాక్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మడివి దేవ మావోయిస్టు పార్టీ ఆర్‌పీసీ కమాండర్, మడకం ఊర సీఎస్‌ఎం కమాండర్‌గా పని చేస్తున్నారు. వెంకటాపురం(కె) మండల కార్యదర్శి సుధాకర్ ఆదేశాల మేరకు చెలిమెల అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలను అమర్చాలని ఆదేశించారు. దీంతో పేలుడు పదార్థాలు అమర్చుతున్న క్రమంలో పోలీసులు చాకచక్యంగా ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్ కుమార్, సీఐ శివప్రసాద్, సీఆర్‌పీఎఫ్ ఎస్సై తిరుపతి రావు, పేరూర్ ఎస్సై హరీష్ , సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఐనవోలు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పంథిని గ్రామం చింతకుంటలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి శ్రీనివాస్‌రెడ్డి(43) తనకున్న ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో సుమారు రూ.10లక్షలు అప్పు అయింది. పంటలు పండక, భూమి అమ్ముకుని అప్పు తీర్చాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం గడ్డిమందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, కుమార్తెలు ఆశ్రిత, హారిక ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

వరంగల్‌లో నృత్యం చేస్తున్న యువతులు



హనుమకొండలో..



జనగామలో..



ఆవిర్భావ సంబురం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సాధించిన పురోగతిని వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


వరంగల్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలో ప్రసంగిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత


మానుకోటలో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


భూపాలపల్లిలో కురుమల విన్యాసాలు


భూపాలపల్లిలో అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


దుస్తులను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


హనుమకొండలో అమరుల కుటుంబ సభ్యులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదాం

- పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ పూజ


మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ ఇంజారపు పూజ

మామునూరు: అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల విధి నిర్వహణ సైతం తోడ్పడాలని, సమష్టిగా రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదామని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. ఖిలా వరంగల్ మండలం పోలీస్ ట్రెనింగ్ కళాశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పోలీసు శిక్షణ కళాశాలలో పరిపాలన భవనం వద్ద పీటీసీ ప్రిన్సిపాల్ పూజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ మన లక్ష్యమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుకెళ్తూ.. రాష్ట్ర శాంతిభద్రత, ప్రజల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, రమేష్, భిక్షపతి, పాండు నాయక్, ఏఎల్ఐలు రాధిక, సత్యనారాయణ, ఆర్ఐలు రాజేష్, చంద్రశేఖర్, దశరథం, నవీన్, సీఎల్ఐలు నరేష్, రవీందర్, డాక్టర్ సుధీర్, ఏఓ ఫర్హానా, పీఆర్‌ఓ రామచారీ, 374 శిక్షణార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ జాతీయ జెండాను ఆవిష్కరించగా.. ఎంవీఐలు రవీందర్, వెంకన్న, ఏఎంవీఐ శాలిని పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపిక


గైడ్ టీచర్ సారంగపాణితో భవాని

కురవి: అంతర్జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు మానుకోట జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన నక్క భవాని, పెద్దవంగర మండలంలోని కొరిపల్లి హైస్కూల్ విద్యార్థి ఎడ్ల నాని 'సకురా సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం ఆఫ్ జపాన్' అనే కార్యక్రమానికి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికకాగా.. జిల్లానుంచి ఇద్దరికి అవకాశం వచ్చినట్లు ఎస్‌సీఈఆర్‌టీ నుంచి లేఖ వచ్చింది. నవంబర్‌లో జపాన్‌లో జరగబోయే అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపికకాగా, వీరు తమ అప్లికేషన్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి పంపించాల్సి ఉంటుంది. భవానీ ఎంపికపై గైడ్ టీచర్ సారంగపాణి, బలపాల సర్పంచ్ ముండ్ల ప్రమీల, మండల రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ ముండ్ల రమేష్, గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.

బండరాయి తలపై పడి యువకుడి దుర్మరణం

- పూడిక తీస్తుండగా ఘటన


పృథ్వి (ఫైల్)

రాయపర్తి: వ్యవసాయ బావిలో క్రేన్ సాయంతో పూడిక మట్టి తీస్తుండగా పైనుంచి బండరాయి తలపై పడి యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొండూరు శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామానికి చెందిన రూపాని నరహరి, యశోద దంపతులు, వారి కుమారుడు రూపాని పృథ్విరాజ్ (26) ముప్పై ఏళ్లక్రితం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి వచ్చి వ్యవసాయక్షేత్రాల్లోని బావుల్లో క్రేన్ సాయంతో పూడిక తీతమట్టి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన నాగేశ్వర్‌రావు వ్యవసాయ భూమిలో బావిలో పూడిక మట్టి తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో ఉన్న పృథ్విపై బండరాయి పడింది. ఈ ఘటనలో పృథ్వి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల కోసం స్థానిక ఎస్సై బండారి రాజును వివరణకోరగా ఎలాంటి పిటీషన్ రాలేదని తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి


మృతిచెందిన విజయ

కేసముద్రం: అజాగ్రత్తతో ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ జారి కిందపడి మృతిచెందిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వల గ్రామానికి చెందిన గంట విజయ(45) మానుకోటకు వెళ్లేందుకు ఓ ఆటోలో ఎక్కింది. ఈ క్రమంలో తాళ్లపూసపల్లి దాటాక ఆటో డ్రైవర్ యుగేందర్ అజాగ్రత్తగా ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయ ఒక్కసారిగా జారి కింద పడింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

ధర్మసాగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ మండలం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధి కాజీపేట మండలం రాంపూర్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొని తలపై నుంచి వెళ్లగా తల ఛిద్రమై మృతి చెందాడు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి పోలీసులు చేరుకున్నారు. అయితే మృతుని తల ఛిద్రమై గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతుడి ఒంటిపై తెలుపురంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రాంపూర్ వీఆర్‌ఏ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

బాలుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి సమ్మయ్యనగర్‌లో శుక్రవారం ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన కోటేశ్వరమ్మకు సమ్మయ్యనగర్‌లో కుమారులతో ఉంటూ కూలీ పనిచేసుకుంటుంది. అయితే చిన్న కుమారుడు తిరుపతి(16)కు సమాచారం ఇవ్వకుండా పెద్ద కుమారుడితోకలిసి కోటేశ్వరమ్మ గురువారం గుంటూరుకు వెళ్లింది. తనకు చెప్పకుండా వెళ్లినందుకు ఆందోళనకు గురైన తిరుపతి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు శ్రీధర్

కాజీపేట అర్బన్: ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీ కొట్టడంతో దర్గా కాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్(33) మృతి చెందిన ఘటన శుక్రవారం న్యూశాయంపేట జంక్షన్‌లో చోటు చేసుకుంది. సుబేదారి పోలీసులు, మృతుడి సోదరుడు పబ్బోజు శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గాకాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం శ్రీధర్ దర్గా కాజీపేట నుంచి వరంగల్‌కు హంటర్‌రోడ్డు మీదుగా తన ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. న్యూ శాయంపేట జంక్షన్‌కు చేరుకోగా ఎదురుగా వస్తు న్న జేసీబీ డ్రైవర్ పల్లెపు సందీప్ అతివేగంతో వచ్చి ఢీ కొట్టాడు. దీంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేర కు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దశాబ్ది ఉత్సవాల నోడల్ ఆఫీసర్‌గా హరిత


కలెక్టర్ సిక్తాతో హరిత

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల నోడల్ ఆఫీసర్‌గా విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ హరితను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె శుక్రవారం హైదరాబాద్ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. హరితను కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా జిల్లాల్లో సమన్వయంతో పనిచేసి దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై అన్నదాతల ఆగ్రహం

- కాటారం–మంథని ప్రధాన రహదారిపై బైఠాయింపు


రహదారిపై ధాన్యానికి నిప్పంటించి ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం: ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని, కేంద్రం నిర్వాహకులు అడ్డదారి తొక్కుతూ పైసలు ముట్టజెప్పినవాళ్లకే గన్నీ సంచులు ఇస్తున్నారని ఆరోపిస్తూ రేగులగూడెం అన్నదాతలు ఆగ్రహించారు. శుక్రవారం కాటారం- మంథని ప్రధాన రహదారిపై రేగులగూడెం వద్ద రోడ్డుకు అడ్డంగా ధాన్యం బస్తాలు, కర్రలు వేసి రైతులు బైఠాయించారు. ధాన్యం బస్తాలకు నిప్పంటించి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణాపై స్పష్టత వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడంతో రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విక్రయించిన ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత ఉందని వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చిన వారికే కేంద్రం నిర్వాహకులు గన్నీ సంచులు ఇస్తున్నారని కాంటాలు తొందరగా అయ్యేలా చూస్తున్నారని రైతులు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణలో అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని విమర్శించారు. కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నా సమాచారం అందుకున్న కాటారం ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ జివాకర్ రెడ్డి, పీఏసీఎస్ అధికారులతో ఎస్సై ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యను వివరించారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా త్వరగా కొనుగోళ్లు సాగేలా చూస్తామని తహసీల్దార్, సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్‌సింగ్

మహబూబాబాద్ అర్బన్: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 60ఏళ్లలో చేయలేని అభివృద్ధి, పీఎం మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధ్యమైందన్నారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన ఘనత బీజేపీదేనని, ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకొని దేశంలో కలిపామన్నారు. కేసీఆర్ తెలంగాణకు చేసిందేమీ లేదని విమర్శించారు. మానుకోట జిల్లాలో మెడికల్ కళాశాల కోసం గిరిజనుల భూములు లాక్కున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దళిత, గిరిజనులకు 3 ఎకరాల భూమి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తెలంగాణ కోసం బలిదానం చేసుకున్న కుటుంబాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో దోచుకున్న వారికే సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, 1,200 తెలంగాణ అమరవీరుల కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఉద్యోగావకాశాలు కల్పించలేదని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్, ఫసల్ బీమా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లాంటి పథకాలు తెలంగాణలో అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని, బిడ్డ కవిత లిక్కర్‌స్కాంలో ఉండగా, కొడుకు కేటీఆర్ ఐటీ మంత్రిగా ఉంటూ దోచుకుంటున్నారని ఆరోపించారు. పోడుభూముల పట్టాలు అందించడంలో సీఎం విఫలయ్యారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్, సీనియర్ నాయకులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.